సీపీఎం అభ్యర్థికి సీపీఐ మద్దతు

విశాలాంధ్ర - గాజువాక : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పొత్తులో భాగంగా గాజువాక నియోజకవర్గం సీపీఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడుకు సీపీఐ పార్టీ మద్దతు నిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఏజే స్టాలిన్ తెలిపారు. బుధవారం ఉదయం సీపీఐ నేత స్టాలిన్‌తో సీపీఎం నేతలు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారాం, ఎం.రాంబాబు, జగన్‌లు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ కాంగ్రెస్, వామపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎం.జగ్గునాయుడు గెలుపు కోసం వామపక్ష పార్టీల శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ఉమ్మడి అభ్యర్థి ఎం.జగ్గు నాయుడు గెలుపు కోసం కార్య కర్తలతో సమావేశం నిర్వహించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని స్టాలిన్ తెలిపారు.

వేటకు వెళ్లి గల్లంతైన
గంగపుత్రులు సురక్షితం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ హార్బర్ నుంచి వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభించింది. అప్పికొండ ప్రాంతంలో ఉన్నట్టుగా అధికారులు గుర్తించడంతో బాధిత మత్స్యకార కుటుంబాలు ఊపిరిపీల్చుకున్నారు. ఆరుగురు మత్స్యకారులు క్షేమంగా వున్నారు. అలల ఉధృతికి సముద్రంలో బోటు బోల్తా పడడంతో దెబ్బతింది. బోటు పై భాగంలో ఆరుగురు మత్స్యకారులు ఉండిపోయారు. బిక్కు బిక్కుమంటూ సముద్రంలోనే రాత్రంతా గడిపారు. మరుసటిరోజు అప్పికొండ తీరానికి చేరుకొని అధికారులకు సమాచారం అందించారు.

రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్ కూటమికే దళితుల ఓటు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: కేంద్రంలో మళ్లీ అధికారం ఇస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తాం అని బహిరంగ ప్రకటన చేసిన బీజేపీని, రాష్ట్రంలో బీజేపీ అలయెన్స్ టీడీపీ, జనసేన పార్టీలకు దళితుల మద్దతు ఉండదని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. బుధవారం విశాఖ నగరంలో అంబేద్కర్ భవన్ వద్ద జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో వెంకటరావు మాట్లాడుతూ 10ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ భారత రాజ్యాంగానికి అడుడగునా తూట్లు పొడుస్తోందన్నారు. 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చేస్తాం అని ప్రకటించిందని, ఇది దేశానికి ప్రమాదకరం అని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఆదివాసీలపై మత విద్వేషంతో మారణ హెూమం సృష్టించి వందల మంది మాన ప్రాణాలను బలి తీసుకోవడంతోపాటు దేశంలో ఆదివాసీలు, దళితులు, క్రైస్తవ ముస్లిం మైనార్టీలకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగ పీఠికలో లౌకికవాదం అనే పదాన్ని తొలగించి మనువాద దృక్పథంతో భారత దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్ర జరుగుతోందన్నారు. కాంగ్రెస్ కూటమిలో బీఎస్పీ ఇతర నీలి పార్టీలను కలిపి విశాల ప్రజాస్వామిక వేదిక నిర్మించాలన్నారు. వేదిక సలహాదారు ఎస్ఆర్ వేమన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పార్టీ బీజేపీ పంచన చేరి దళితులను, మైనారిటీలను హత్యలు చేస్తూ శవాలను ఇళ్లకు పార్శిల్ చేస్తూ హంతకులను భుజాలకెత్తుకుని ఎస్సీలకు ఛాలెంజ్ విసురుతోందన్నారు. ఈ రాష్ట్రంలో మేమే ప్రత్యామ్నాయం అన్న టీడీపీ, జనసేన కూటమి బీజేపీతో జట్టుకట్టి దళితులను, లౌకిక వాదులను దూరం చేసుకుందన్నారు. గతంలో నీలి జెండాకు ఓటు ద్వారా బహుజన రాజ్యాధికారం అని ప్రకటించిన విదసం నేడు దేశ విపత్కర, తప్పని పరిస్థితుల్లో తన పంథా మార్చుకుందన్నారు. సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బల్ల కుమార్, జాజి ఓంకార్, బోడపాటి శామ్యూల్ కుమార్, బూల భాస్కరరావు, గుడాల ఈశ్వరరావు, పి.శ్రీనివాస్, మందా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న బీఎస్పీ అభ్యర్థి భాగం

విశాలాంధ్ర - భీమిలి: బీఎస్పీ శాసనసభ అభ్యర్థి బాగా గోపాలరావు పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న రుషికొండ, నిడిగట్టు, నేరలవలస గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో పలు దళిత సంఘాల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనాలో దళితులకు రావాల్సిన రుణాలు ఏవీ రాలేదన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య, ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్‌ను నిర్వీర్యం చేసి ఎస్సీలకు రావలసిన నిధులను పక్కతోవ పట్టించారని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న ముసలి వాడ, నిడిగట్టు, నేరెళ్ల వలస తదితర గ్రామాల యువకులు, దళితులు వివిధ వర్గాలకు చెందిన వారు బీఎస్పీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా వాలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని సొంట్యం గ్రామంలో బుధవారం వాలంటీర్లు తమ నాయకునిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ చంద్రమౌళికి 5గురు వాలంటీర్లు రాజీనామా పత్రాలని అందజేశారు. భీమిలి వైసీపీ అభ్యర్థి, శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు వెంట నడిచేందుకు సిద్ధమైన వాలంటీర్లు జై జగన్, జై అవంతి అంటూ నినాదాలు చేశారు. తనను నమ్ముకున్న వారిని ఎన్నటికి విడిచి పెట్టనని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తానని అవంతి, లెంక రాంబాబు హామీ ఇచ్చారు.

చైతన్య ఇంజనీరింగ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి
ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దీక్ష

విశాలాంధ్ర - విశాఖ: కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని రూప శ్రీ మృతికి కారణమైన కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల గుర్తింపును రద్దు చేయాలి ఏఐఎస్ఎఫ్ విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ మధురవాడ సమీపంలోని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో లైంగిక వేధింపులకు తాళలేక డిప్లమో ఫస్ట్ ఇయర్ విద్యార్థి రూప శ్రీ (16) గురువారం రాత్రి ఒంటి గంటకు హాస్టల్ 4వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. చనిపోయే ముందు తన నాన్నకు మెసేజ్ పెడుతూ 'ఆత్మహత్య చేసుకోవడానికి కారణం కళాశాలలో లైంగిక వేధింపులని పేర్కొందని తెలిపారు. ఫ్యాకల్టీయే లైంగిక వేధింపులకు పాల్పడుతోందని అందులో వెల్లడించిందని చెప్పారు. చాలా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, కళాశాలలో చాలామంది విద్యార్థినులు లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారని ఆమె ఆ మెసేజ్ లో పేర్కొందని చెప్పారు. ఎవరికీ చెప్పుకోలేక, కాలేజీకి వెళ్లలేక నలిగిపోతున్నామని వెల్లడించిందని అన్నారు. పోలీసులకు చెబితే సోషల్ మీడియాలో అసభ్యకరమైన ఫొటోలు పెడతామంటూ బెదిరి స్తున్నారని తెలిపిందని చెప్పారు. ఎవరో ఒకరు చనిపోతేకానీ బయట ప్రపంచానికి ఈ కీచకుల గురించి తెలియదని, ఆ పని తాను చేస్తున్నానని ఆ మెసేజ్‌లో పేర్కొందని అన్నారు. తాను ఒక మంచి కుమార్తెను కాలేకపోయినందుకు క్షమించమని తన ఆవేదనను వెల్లడించిందని తెలిపారు. ఇది ఆత్మహత్య కాదని, యాజమాన్యం చేసిన హత్య అని తెలిపారు. మరింత లోతుగా విచారణ జరిపి నిజానిజాలను నిష్పక్షపాతంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన ఫ్యాకల్టీని శిక్షించాలని, కళాశాలలో లైంగిక వేధింపులను అరికట్టి, లైంగిక వేధింపులకు గురవుతున్న చైతన్య కళాశాల విద్యార్థినులు అందరికీ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని, రూపశ్రీ కుటుంబానికి న్యాయం చేసే వరకూ దీక్ష విరమించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూప శ్రీ తల్లిదండ్రులు, ఇతర విద్యార్థి, మహిళ, కుల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి దీక్ష శిబిరాన్ని సందర్శించారు.

89వ వార్డులో వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర - మద్రిపాలెం: 89వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు వైసీపీలో చేరారు. ఈ మేరకు బుధవారం 50 మంది కార్యకర్తలు కొత్తపాలెం సంతోష్ నగర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో జాయిన్ అయిన వారిని ఆనంద్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పేడాడ రమణికుమారి, వార్డు అధ్యక్షులు ఐతం శెట్టి గోపి, 89వ వార్డు ఇన్చార్జి దొడ్డి కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడ్రాజు, వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మల్ల శ్రీను, కృష్ణమాచారి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలను సందర్శించిన జెడ్పీ సీఈఓ

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో పలు సచివాలయాలను బుధవారం ఉదయం జిల్లా ముఖ్య కార్య నిర్వహణ అధికారి పోలినాయుడు సందర్శించారు. ఆనందపురం పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయంలో సిబ్బందికి పంపిణీ చేస్తున్న పెన్షన్లు ప్రక్రియను సందర్శించి పెన్షన్‌కి వచ్చే వృద్ధులకు మంచినీళ్లు వాళ్ళు కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పింఛన్‌దారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం బోని వాటర్ వర్క్స్ పరిశీలనకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు, కార్యదర్శి శ్రీరామ్ మూర్తి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఆడారి సతీమణి

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు బాజీ జంక్షన్, రెడ్డి వీధి, జయప్రకాష్ నగర్‌లలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సతీమణి ఆడారి మాలతి, పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులు పేడాడ రమణి కుమారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో కొంతసేపు ముచ్చటించారు. రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. 91వ వార్డు భాజీ జంక్షన్‌లో ఫిజియోథెరపీ హాస్పిటల్‌ను జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డు అధ్యక్షులు గొర్లే అప్పలస్వామి నాయుడు, పార్టీ మండల అధ్యక్షులు గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాసుపల్లి, లక్ష్మీనారాయణ పరస్పర అభివాదాలు
- పార్టీలు వేరైనా అభ్యర్థుల లక్ష్యం ఒక్కటే

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దక్షిణ నియోజక వర్గం వాసుపల్లి గణేష్ కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గం అభ్యర్థి లక్ష్మీనారాయణ బుధవారం ఒకరికొకరు ఎదురు పడ్డారు. ఆశీల్‌మెట్ట సంపత్ వినాయక టెంపుల్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అభివాదం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల వేళ పార్టీలు వేరైనప్పటికీ బుధవారం స్వామివారి దర్శనం కోసం వచ్చిన వారు ఉదయం ఎదురుపడటం ఆకర్షణీయంగా నిలిచింది. దక్షిణ నియోజకవర్గంలో తనని బలపరిచే విధంగా వైసీపీకి సపోర్ట్ చేయాలని వాసుపల్లి అభ్యర్థించారు. రాజకీయ అంశాలపై కాసేపు ముచ్చటించుకున్నారు.

పింఛన్ కోసం అవ్వతాతల ఇక్కట్లు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలో గల 8078 సామాజిక భద్రత ఫించన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా లబ్దిదారులకు పంపిణీ చేయు కార్యక్రమం బుధవారం మండలంలో గల అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభించారు. మద్ది, భాందేవుపురం, పద్మనాభం గ్రామ సచివాలయలలో పరిధిలో సచివాలయ సిబ్బందిచే జరుగుతున్న ఫించను పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.శైలజ స్వయంగా సందర్శించి పర్యవేక్షించారు. కొంతమంది పెన్షన్‌దారులు ఇంటి దగ్గర నుంచి సచివాలయానికి రావడానికి కూడా నడవలేని పరిస్థితి వయోభారం అనారోగ్య పరిస్థితులు ఉన్నవారు చాలా మంది ఉన్నారని ఇక్కడికి వచ్చి పెన్షన్ తీసుకోవడం ఎంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆవేదన చెందుతున్నారు. తీవ్రమైన ఎండ వేడి వల్ల సొమ్మసిల్లి పడిపోయే పరిస్థితి ఉందని వారు వాపోతున్నారు. ఇన్నాళ్లు ఇంటిపట్టున ఉండే మేము ఒకేసారి ఎండలో ఉండటం అంటే తమ ఆరోగ్యం మరీ దెబ్బతింటుందని తీవ్ర అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని వారు తెలియజేశారు. ప్రభుత్వం వారు వచ్చే నెల నుండి అయినా మానవతా దృక్పథంతో ఆలోచించి పెన్షన్ ఇంటి వద్దకే పంపిణీ చేసే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. అవ్వ తాతలను మీ రాజకీయాలకు బలి చేయొద్దని వారు కోరారు.

పెందుర్తి నుండి ఇండిపెండెంట్‌గా విజయం సాధిస్తా

గుంటూరు వెంకట నరసింహారావు

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆంధ్ర ప్రదేశ్ గిద్దంగుల శాఖ మాజీ సభ్యుడు గుంటూరు వెంకట నరసింహారావు తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఆయన పార్టీలో గల పలు వురు నాయకులు, కార్యకర్తలతో తనకున్న పరిచయాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అలాగే గతంలో ప్రజారాజ్యం పార్టీలో పనిచేసిన పలువురు ప్రముఖులను కలిసి మద్దతు కోరుతున్నారు. బుధవారం ఉదయం పరవాడ మండలం దేశపాత్రునిపాలెంలో పర్యటించి పిల్లా నూకరాజు, నగిరెడ్డి శ్రీనివాసరావు, బొండ నర్సింగరావు, బలరామకృష్ణ, మనోహర్ నాయుడు, నర్సింగరావు తదితర ప్రముఖులను కలిసి మద్దతు కోరారు. వారంతా సానుకూలంగా స్పందించి సంఘీభావం తెలియజేసినట్లు నరసింహారావు మీడియాకు తెలియజేశారు. ఆయా ప్రాంతాల నాయకులు అభిమానుల మద్దతుతో, వచ్చే ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గం నుండి తప్పకుండా విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా వార్డు అధ్యక్షులు శాఖరి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - సాగర్‌నగర్: జనసేన పార్టీ 8వ వార్డు అధ్యక్షులు శాఖరి శ్రీనివాస్ జన్మదినోత్సవ వేడుకలు జనసేన పార్టీ కార్యాలయంలో వైభవంగా జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ ఉమ్మడి విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి మతుకుమిల్లి భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. 8వ వార్డు జనసైనికుల ఆధ్వర్యంలో ఉదయం వారిజ ఆశ్రమంలో అంధ విద్యార్థులకు అల్పాహారం, సాగర్ నగర్ ఈనాడు లేఔట్‌లో గల వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తూర్పు గోదావరి జిల్లాలో వెంకటాయపాలెంలో సంచలనం సృష్టించిన దళితుల శిరోముండనం కేసులో నిందితుడిగా వున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం విశాఖపట్నంలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. తోట త్రిమూర్తులతో పాటు ఇతర నిందితులు కూడా హాజరయ్యారు. కోర్టులో చివరి విచారణ పూర్తి అయ్యింది. ఏప్రిల్ 12వ తేదీన తీర్పు వెలువరించ నున్నట్లు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ ప్రకటించినట్లు తెలుస్తోంది.

ఇళ్ల వద్దే పింఛన్లు ఇవ్వాలి
సిపిఐ భీమిలి కమిటీ డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : సామాజిక పింఛన్లపై ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేయాలని భీమిలి మునిసిపల్ కమిషనర్‌ని సిపిఐ భీమిలి ఏరియా కమిటీ కార్యదర్శి కానూరు రాంబాబు డిమాండ్ చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని వృద్ధులు, వికలాంగులుకు ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వాలని కోరారు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దనే పింఛన్లు ఇప్పించాలని లేనిపక్షంలో బంతేటమైదానం కళ్యాణ మండపం సమీపంలో పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోర అప్పలరాజు, అల్లం గోవింద్, మావూరి వీర్రాజు, వానపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

19న తిరువీధి కళ్యాణోత్సవం
మే 10న అప్పన నిజరూప దర్శనం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనర సింహస్వామి వారి వార్షిక తిరు కళ్యాణం, రథోత్సవం ఈ నెల 19న జరుగనుంది. 9వ తేదీ ఇందులో భాగంగా ఉగాది పర్వదినం రోజున ఆలయంలో మూడుచోట్ల పెళ్లి రాటలు వేయనున్నారు. ఆ రోజు నుంచి స్వామి పెళ్లి పనులు ప్రారంభించనున్నారు. ఈ నెల 19న రాత్రి 8గంటలకు రథోత్సవం, 9.30గంటలకు కళ్యాణోత్సవం జరిపిం చనున్నారు. మే 10న అప్పన నిజరూప దర్శనం(చందనోత్సవం) అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం ఆలయ ఈవో సింగం శ్రీనివాసమూర్తి ఆయా ఉత్సవాలకు సంబంధించి వైదిక వర్గాలతో కలసి ఆలయంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రధానంగా భక్తుల రాకపోకలు, స్వామిని సులభతరంగా భక్తులు దర్శించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లపై వైదిక వర్గాల నుంచి సలహాలు స్వీకరించారు. అంతేకాకుండా ఆలయం చుట్టూ భక్తులు ఏఏ మార్గాల్లో బయటకు సులభంగా చేరుకోగలరు, లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం, గోదాదేవి ఆలయం వద్ద భక్తుల క్యూలైన్లు పరిశీలించారు. అయితే చందనోత్సవం రోజున స్వామిని దర్శించుకున్న భక్తులు వెంటనే ఆలయం బయటకి వెళ్లే మార్గాలను పరిశీలించారు. పాలక మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు గతంలో జరిగిన ఉత్సవాల సమయంలో ఏఏ ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది? ఎక్కడెక్కడ భక్తుల సమస్యలు ఎదుర్కొంటున్నారు, క్యూలైన్ల నిర్వహణ ఇతర అంశాలను ఈవో దృష్టికి తీసుకువెళ్లారు. ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఆలంకార్ కర్రి సీతారామాచార్యులు, ఇతర అర్చక పరివారం, అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రాజు, ఏఈవో పాలూరి నరసింగరావు, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఉన్నారు.

నేను స్థానికుడిని....మీ సమస్యల పరిష్కారానికి నాది హామీ

- గాజువాక నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్నాథ్ వెల్లడి

విశాలాంధ్ర - గాజువాక: నేను గాజువాకకు స్థానికుడినే. మా తండ్రి, మా తాత ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. నేను ఇక్కడి నుంచి అనకాపల్లి వెళ్లాను తప్ప, అనకాపల్లి నుంచి ఇక్కడికి రాలేదు. నేను మీ కుటుంబ సభ్యుడిని ఎన్నికల్లో నాకు ఓటేసి గెలిపించే బాధ్యత మీదే అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. స్థానిక 73వ వార్డులోని సమతా నగర్‌లో కార్పొరేటర్ భూపతి రాజు సుజాత శ్రీనివాస్ నేతృత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమర్నాథ్ మాట్లాడుతూ తన చిన్నతనం నుంచి గాజువాక ప్రజలతో కలిసి మెలిసి తిరిగానని, ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని, తనను ఎన్నికల్లో గెలిపిస్తే గాజువాకలో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావలసిన అవసరం ఎంతైనా ఉందని, ఆయన అధికారంలోకి వస్తేనే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలియజేశారు. ఐదు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించారని చెప్పారు. ఈ నియోజకవర్గంలో దాదాపు 2000 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, గతంలో ఎప్పుడు ఈ నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి జరగలేదని అని చెప్పారు. గుడివాడ వారసుడిగా, మీ కుటుంబాల్లో ఒక సభ్యునిగా తనను భావించి ఈ ఎన్నికల్లో తనకు, పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీకి ఓటు వేయాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాకను ఇప్పటికే చాలా వరకు అభివృద్ధి చేశామని భవిష్యత్తులో గాజువాకలోని మరిన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. కార్పొరేటర్ భూపతి రాజు సుజాత మాట్లాడుతూ గాజువాక అభివృద్ధి విషయంలో నాగిరెడ్డి చూపిన చొరవ అభినందనీయమని అన్నారు. గురునాథరావు ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఈ ప్రాంతంలో ఇళ్లు కాలిపోతే తక్షణం పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో భూపతి రాజు శ్రీనివాస్, పల్లా చినతల్లి, రాజన వెంకటరావు, కులుకూరు మంగరాజు మొల్లి చిన్న, మొహమ్మద్ గౌస్, షౌకత్ అలీ, ఆళ్ల శివ గణేష్, ఈగల పార్టీ యువశ్రీ, గొందేసి రమణారెడ్డి, కంది పైడినాయుడు, కరణం వేణుగోపాల్, వి.రామకృష్ణరాజు, గొరుసు సత్యం రెడ్డి, బొట్ట సత్తిబాబు, ప్రభ, కే.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి పునరావాస కాలనీ పెనమడకలో శ్రీ సత్య సాయి క్లినిక్ విజన్ కేర్ నేత్ర ఆర్గనైజేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషిలోని ముఖ్యమైన అవయవాల్లో నేత్రం ప్రముఖమైనదని పేద ప్రజలకు అందుబాటులో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. విజన్ కేర్ ప్రముఖ నేత్ర వైద్యులు కే.శివకుమార్ మాట్లాడుతూ కళ్ళు మసగ్గా కనబడినట్లైతే అశ్రద్ధ చేయకుండా వెంటనే నేత్ర వైద్యుల్ని సంప్రదించాలని కోరారు. అగనంపూడి జనరల్ ఆస్పత్రిలో ఉన్న కేర్ విజన్ ఆధ్వర్యంలో ఇప్పటికీ 9 ఉచిత నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. విశాఖ లైన్స్ క్లబ్ చైర్ పర్సన్ కడిమి హనుమంతరావు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రామారావు, డాక్టర్ కేజే నాయుడు, టిడిపి నాయకులు గొల్లవిల్లి నూకరాజు, అండబోయిన మంగరాజు, జనసేన పార్టీ నాయకులు అట్ట అప్పారావు, అగనంపూడి లైన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎం.జగదీష్, ఐ.రామ్ గోపాల్, ఏవి రామకృష్ణ, జి.గోవిందరావు, భక్తుల కాళిదాసు, ఎం.మస్తాన్ రెడ్డి, జిల్లా పరిషత్తు హై స్కూల్ పిటి మాస్టర్ నాయుడు, విజన్ కేర్ ప్రతినిధి కే.సుధారాణి తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి క్లినిక్ అధినేత వివి రామారావుని సన్మానించడం జరిగింది.

టీడీపీ కార్పొరేటర్లతో బీజేపీ నాయకుల సమన్వయ సమావేశం

విశాలాంధ్ర - పెందుర్తి: అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంతో పాటు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు బరిలో లేకపోవడంతో, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ నేతలను కార్యోన్ముఖులను చేసేందుకు భారతీయ జనతా పార్టీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. టిడిపి ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనాలని కోరుతోంది. ఈ క్రమంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు శ్రీనివాస నాయుడు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ గొర్లె రాము నాయుడు పార్టీ నాయకులు ప్రసాద్ లక్ష్మణ్ మంగయ్య నాయుడు శంకర్ తదితరులు జీవీఎంసీ 97 వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు దంపతులు, 94 వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, 98 వ వార్డు కార్పొరేటర్ పరాహ నరసింహం, 93వ వార్డ్ కార్పొరేటర్ రాపర్తి కన్నా తదితరులను కలిసి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన టిడిపి నేతలు వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపు పాటుపడతామని హామీ ఇచ్చారు.

మండల సమావేశం

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఎటువంటి సమీక్షలు, తీర్మానములు చేపట్టుటకు వీలు కానందున ప్రస్తుత వేసవిలో త్రాగునీటి ఎద్దడి దృష్ట్యా సంబంధిత అధికారులకు నీటి ఎద్దడి నివారణకు తగు సూచనలు చేశారు. విద్యుత్తు విభాగానికి కూడా సూచనలు చేసి సమావేశమును ముగించారు.

నేవల్ సివిలియన్స్ వేడుకల్లో భాగంగా రిక్రియేషన్ రూమ్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నేవల్ సివిలియన్స్ వేడుకల్లో భాగంగా వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా విశాఖపట్నం బేస్ విక్చువలింగ్ యార్డ్‌లో తన పర్యటన సందర్భంగా రిక్రియేషన్ రూమ్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ సందర్శన స్టోర్ హౌస్‌ల చుట్టూ వివేకవంతమైన నడక, యార్డ్ సిబ్బందితో పరస్పర చర్యతో ముగిసింది.

ప్లాటినమ్ ఆభరణాలకు పెరుగుతున్న ఆదరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్లాటినం ఆభరణాలకు ఆదరణ రోజు రోజుకి పెరుగుతుందని వినియోగదారులు ఈ ఆభరణాలు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఉగాది పండుగ పురస్కరించుకొని పీజీఐ ఆధ్వర్యంలో నూతన ప్లాటినం ఆభరణాల సేకరణ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వైశాలి బెనర్జీ తెలిపారు. ప్లాటినం ఆభరణాల డిమాండ్ అన్ని రిటైల్ భాగస్వాములతో కలిసి అడుగులు వేస్తుందన్నారు. రాబోయే ఉత్సవాలు తమ విలువైన రిటైల్ భాగస్వాములకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ త్రైమాసికంలో అమ్మకాలలో సానుకూల పథాన్ని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. జీఆర్టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ జీఆర్ 'ఆనంద్' అనంతపద్మనాభన్, జీఆర్ రాధాకృష్ణన్, కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ ఉగాది సందర్భంగా వినియోగదారులు ప్లాటినం ఆభరణాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

అధునాతన సాంకేతికతతో అర్బన్ క్రూయిజర్ టైజర్

విశాలాంధ్ర- విశాఖ సిటీ: టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్‌ను టొయోటా కిర్లోస్కర్ మోటర్ (టీ కే ఎం) విడుదల చేసింది. ఎ -ఎస్ యువీ విభాగంలోకి కంపెనీ రీ-ఎంట్రీని గుర్తుచేస్తూ, పూర్తి సరికొత్త టొయోటా అర్బన్ క్రూయిజర్ టైజర్ ఆధునిక స్టైలింగ్, అత్యాధునిక ఫీచర్లు సాంకేతికతలను కలిగి ఉందని టీకేఎం ప్రతినిధి చెప్పారు. పూర్తి సరికొత్త అర్బన్ క్రూయిజర్ టైజర్ 1.0 లీ టర్బో, 1.2 లీ పెట్రోల్ ఈ - సీ ఎన్ జీ ఎంపికలలో అందుబాటులో ఉందన్నారు.

1.0 టర్బో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో అందుబాటులో ఉందన్నారు. తద్వారా పవర్ పెర్ఫార్మెన్స్ ప్రాధాన్యతలు రెండింటికీ ప్రాధాన్యత ఇచ్చే కస్టమర్‌లకు వైవిధ్యమైన ఎంపికను అందిస్తుంది. 1.2 లీ పెట్రోల్ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మరియు ఇంటెలిజెంట్ గేర్ షిఫ్ట్ (ఐ జీ ఎస్)లో వస్తుంది. 1.2 లీ ఈ- సీ ఎన్ జీ 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌లో లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన టొయోటా కిర్లోస్కర్ మోటర్ యొక్క ఎండీ మసకాజు యోషిమురా తెలిపారు.

పెందుర్తి కాంగ్రెస్ టికెట్

స్థానికులకే కేటాయించాలి

పిరిడి భగత్ అభ్యర్థిత్వంపై నేతల తీవ్ర నిరసన

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ టికెట్‌ను స్థానికులకే కేటాయించాలని నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా, డిసిసి ఉపాధ్యక్షుడు విన్నకోట రాము, డి సి సి, ఓ బి సి జనరల్ సెక్రెటరీ ఆర్ఆర్ నాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి కొమ్మోజు లక్ష్మోజీ, కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి గండి సన్నిబాబు, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షుడు బయలుపూడి రాంబాబు, స్టీల్ ప్లాంట్ పోరాట కమిటీ సభ్యుడు కడియం శివాజీ తదితరులు పెందుర్తిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా పార్టీ పురోగతి కోసం ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి అహర్నిశలు పాటుపడుతున్న తమను కాదని నియోజకవర్గానికి జిల్లాకు సంబంధం లేని వ్యక్తికి సీటు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం భౌగోళిక స్వరూపం తెలియని పిరిడి భగత్ కు సీటు ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంతో పాటు పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి తమలో చాలామంది దరఖాస్తు చేసామని తమలో ఎవరికి సీటు ఇచ్చిన అందరం కలిసికట్టుగా

పని చేసి విజయం సాధిస్తామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిగాను షర్మిల రెడ్డిని ముఖ్యమంత్రిగాను చేయడం కోసం తపోనిష్టతో పనిచేస్తున్న తమకు అన్యాయం చేయడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా పార్టీ నాయకత్వం సర్వే చేయించి అర్హుడైన స్థానిక వ్యక్తికి పెందుర్తి సీటు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. పిసిసి అధ్యక్షురాలు శర్మిలా రెడ్డిని కలిసి తమ ఆవేదనను వెల్లడిస్తామని స్పష్టం చేశారు. షర్మిల నాయకత్వంపై నమ్మకం ఉందని తమలో ఒకరికి సీటు ఇస్తారన్న ఆశ ఉందని వారు పేర్కొన్నారు. లేకుంటే ప్రజల్లోకి తప్పుడు సందేశాలు వెళ్తాయని వెల్లడించారు.

జోరుగా వైసీపీ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని సొంట్యాం, గండిగుండం గ్రామాల్లో వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, శాసనసభ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సొంట్యాం, గండిగుండం గ్రామంలో ప్రచారాన్ని ప్రారంభించి వారు మాట్లాడారు. రానున్న శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను గెలిపించి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గజమాలతో ఘనంగా సత్కరించారు. సొంట్యాంలో జరిగిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, భారీ గజమాలతో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొంట్యాం సర్పంచ్ లంక లావణ్య రాంబాబు, గండిగుండం సర్పంచ్ గన్ రెడ్డి శ్రీను, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యం, జెడ్పీటీసీ కోరాడ వెంకటరావు, ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకట్రావు, వైస్

ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నాయకులు బంటుబిల్లి మణిశంకర్ నాయుడు, పాండ్రంకి అప్పారావు, పినిశెట్టి సింహాచలం నాయుడు, ఇల్లాపు వెంకట జగన్, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూటమికే పట్టం కట్టాలి

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

విశాలాంధ్ర - కశింకోట (అనకాపల్లి): అనకాపల్లి మండలంలోని వల్లూరు, ఎరుకవానిపాలెం, రాజుపాలెం గ్రామాల నాయకులతో తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి అభ్యర్థి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ కాఫీ విత్ కేడర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో సీనియర్ని, పెద్దవాడిని అయినా సరే ఇప్పుడున్న కూటమిలో భాగంగా నేను చాలా చిన్నవాడిని నాకన్నా పెద్దవారు అన్నదమ్ములు లాంటి తెలుగుదేశం బిజెపి నాయకులు ఉన్నారనీ వారి చేతులు పట్టుకొని నేను నడుస్తానని జనసేన పేరుతో నేను గెలిచిన సరే తెలుగుదేశానికే ముఖ్య ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ఒక్క ఛాన్స్ అని అడిగి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారు. అలాగే మన ప్రాంతంలో పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉన్నప్పటికీ వైసీపీ ఎమ్మెల్యే అమర్నాథ్ పారిశ్రామిక మంత్రిగా ఉన్నప్పటికీ ఒక పరిశ్రమను కూడా తీసుకురాలేని పరిస్థితి ఏర్పడిందని అలాగే వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడేటటువంటి పోలవరం ప్రాజెక్ట్ ని నిర్వీర్యం చేశారని ఇలా చెప్పుకుంటూ పోతే రాష్ట్రం మొత్తం నిర్వీర్యం చేసి దోచుకుపోయారని కనీసం రాజధాని కూడా నిర్మించలేని రాష్ట్రంగా దేశంలో మన రాష్ట్ర ఒకటే ఉన్నదని గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఏమైనా అభివృద్ధి చేసింది అంటే పూర్తిగా ప్రభుత్వ భూములు అన్ని వాళ్లు దోచుకోవడంలో అభివృద్ధి చెందిందని చెప్పుకోవాలి అని అన్నారు. ఈ సమస్యలన్నీ అభివృద్ధి దిశలో ముందుకు వెళ్లాలంటే ఒక్క చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యం పడుతుందని కనుక చంద్రబాబు నాయుడు నాయకత్వం ఇప్పుడు మన రాష్ట్రానికి చాలా అవసరమని అన్నారు. కనుక మన రాష్ట్రం మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మనకు మంచి రోజులు రావాలంటే తెలుగుదేశం జనసేన బిజెపి కూటమిలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి గాజు గ్లాస్ గుర్తుపై అలాగే ఎంపీ అభ్యర్థి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఈ రెండు గుర్తులను ప్రతి ఇంటికి ప్రతి ఓటర్కి చేరే విధంగా ముందుకు తీసుకెళ్లాలని నాయకులకు సూచించారు. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం.రమేష్ తనయుడు రిత్విక్ మాట్లాడుతూ. గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి పథకాల పేరుతో ఈ రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టారని అన్నొచ్చాడు బటన్ నొక్కాడు అని చెప్పుకుంటున్న జగన్ కి రేపు జరగబోయే ఎలక్షన్లలో కూటమి అభ్యర్థుల గుర్తులపై బటన్ నొక్కి బుద్ధి చెప్పాలని అన్నారు. మీ ప్రాంతంలో పారిశ్రామికంగా ఎంత అభివృద్ధి చెందాల్సి ఉన్నా ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడం దురదృష్టకరమని ఈ ఎలక్షన్లలో కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో టిడిపి జనసేన కూటమి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడగానే మీ ప్రాంతానికి పరిశ్రమలు రావాలంటే అది ఒక్క బిజెపి ప్రభుత్వం వస్తేనే సాధ్యపడుతుందని కనుక మీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కమలం గుర్తుపై మరియు ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గాజు గ్లాస్ గుర్తుపై బటన్ నొక్కి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్, డా. నారాయణరావు, బొడ్డేడ జోగినాయుడు , బిజెపి నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు , జనసేన నాయకులు మళ్ల శ్రీను , ఎరుకావానిపాలెం , వల్లూరు , రాజు పాలెం జనసేన నాయకులు గొల్లవిల్లి శ్రీనివాస్ రావు, మునిలి నాయుడు, ఆది సూరప్పారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్లవిల్లి బాబురావు , గొర్లి రాము నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.